కనీస వసతుల్లేని హాస్టళ్లు

లింగాల : మండలంలోని ఎస్సీ, బీసీ బాలుర వసతి గృహాలలో కనీస సౌకర్యాలు లేవు. పాఠశాలలు ప్రారంభమై రెండు మాసాలవుతున్నా ఇంతవరకు విద్యార్థులకు దుప్పట్లను కూడా ప్రభుత్వం అందించలేదు. దీంతో విద్యార్థులు వారి ఇళ్ల నుంచి తెచ్చుకున్న చాపలు, దుప్పట్లతో నేలపై పడుకోవాల్సిన దుస్థితి ఏర్పడింది. ఉదయం, సాయంత్రం విద్యార్థులకు విద్యనందించేందుకు ట్యూటర్లను కూడా నియమించలేని పరిస్థితి ఏర్పడింది. బీసీ హాస్టల్‌కు పర్మినెంట్ వార్డెన్ కూడా లేరు. రాత్రిపూట వాచ్‌మెన్ల సహాయంతోనే వసతి గృహాలు కొనసాగుతున్నాయి.

చక్రాయపేటలో..

చక్రాయపేట : మండల కేంద్రమైన చక్రాయపేట బీసీ హాస్టల్‌లో విద్యార్థులకు సమస్యలు నెలకొన్నాయి. ఈ హాస్టల్‌లో మొత్తం 102 మంది విద్యార్థులున్నారు. హాస్టల్ గోడలు నెర్రెలు చీలాయి, కిటికీ చెక్కలు లేకుండా ఊడిపోయాయి. హాస్టల్ చుట్టూ కంపచెట్లు ఎక్కువగా ఉండటంతో విషపురుగులు ఎక్కువగా వస్తున్నాయి. ఈ విద్యా సంవత్సరానికి సంబంధించి ఇంతవరకు విద్యార్థులకు బెడ్ షీట్లు కానీ, ప్లేట్లు, గ్లాసులు గానీ ఇవ్వలేదు. హాస్టల్ ఆవరణలో కంపచెట్లు, గడ్డి ఉన్నందున దోమలు విజృంభిస్తున్నాయి. హాస్టల్ గదిలో ఉన్న ఫ్యాన్లు కూడా సక్రమంగా పనిచేయలేదు. ఇక్కడ పనిచేస్తున్న వార్డెన్ రాజబాబుకు వీరపునాయునిపల్లె హాస్టల్ కూడా ఇన్‌చార్జిగా నియమించారు. ఈ వార్డెన్ చక్రాయపేటకు వారానికి ఒకట్రెండు సార్లు మాత్రమే వస్తారని, మిగిలిన రోజులలో రారని తెలిసింది.

పులివెందులలో..

పులివెందుల రూరల్ : పట్టణంలోని వసతి గృహాలలో విద్యార్థులను తాగునీటి సమస్యలు వెంటాడుతున్నాయి. దీంతో హాస్టళ్లలో చదువుతున్న విద్యార్థులు తాగునీటికి తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు. వసతి గృహాలలో తాగునీటికి సంబంధించి ఆర్‌ఓ ప్లాంట్లు ఏర్పాటు చేయాలి. పట్టణంలోని అంకాలమ్మపేటలో ఉన్న బాలుర వసతి గృహంలోనూ, పార్నపల్లె రోడ్డు సమీపంలో ఉన్న అంకాలమ్మ గుడి వద్ద బాలికల వసతి గృహంలోనూ, శ్రీనివాసహాలు సమీపంలో ఉన్న బాలుర కళాశాల వసతి గృహంలో ఆర్‌ఓ ప్లాంట్లు లేక విద్యార్థులు అవస్థలు పడుతున్నారు.

వీరపునాయునిపల్లెలో..

వీరపునాయునిపల్లె : మండలంలో ఉన్న వసతి గృహాల్లోని విద్యార్థులు అరకొర సౌకర్యాల మధ్య విద్యనభ్యసిస్తున్నారు. మండల కేంద్రంలో ఎస్సీ బాలురు, బీసీ బాలురు, బాలికల వసతి గృహాలు ఉన్నాయి. ఎస్సీ బాలుర వసతి గృహం మాత్రం ప్రభుత్వ భవనంలో కొనసాగుతోంది. మిగిలిన రెండు వసతి గృహాలు ప్రైవేటు గృహాల్లో కొనసాగుతు న్నాయి. మూడు వసతి గృహాల్లో విద్యార్థులు నేలమీదనే పడుకొంటున్నారు. బీసీ బాలుర గృహంలో టాయిలెట్‌లు అరకొరగానే ఉన్నాయి. మెరుగైన సౌకర్యాలు కల్పించాలని విద్యార్థులు కోరుతున్నారు.



వీరపునాయునిపల్లె : ఎస్సీ బాలుర వసతి గృహంలో నేలపై పడుకుంటున్న విద్యార్థులు

జమ్మలమడుగులో..

జమ్మలమడుగు/జమ్మలమడుగు రూరల్,మైలవరం : ప్రభుత్వ వసతిగృహాలు సమస్యల సుడిగుండంలో చిక్కుకున్నాయి. హాస్టల్‌లో విద్యార్థులు సంఖ్య గణనీయంగా ఉన్నా అందుకు తగ్గట్టుగా వసతులు లేకపోవడంతో విద్యార్థులు తీవ్ర అవస్థలు పడుతున్నారు. నియోజకవర్గంలో 4 బీసీ మహిళ, 4 బీసీ బాలుర, 2 ఎస్సీ బాలిక, 2 ఎస్సీ బాలుర వసతి గృహాలు ఉన్నాయి. అందులో ప్రధానంగా బీసీ హస్టల్ వసతిగృహం పట్టణంలోని బ్యాంక్ కాలనీలో అద్దె భవనాల్లో నడుస్తుంది. మొత్తం 70 మంది విద్యార్థులు ఉండగా వారికి 2 బాత్‌రూంలు మాత్రమే ఉండటం విశేషం. విద్యార్థులు ఆరుబయట స్నానాలు చేయవలసి వస్తుంది. జమ్మలమడుగు పట్టణంలోని ఎంపీడీఓ కార్యాలయ సమీపంలో ఎస్సీ బాలికల వసతి గృహాన్ని 1978లో నిర్మించారు. దీంతో స్లాబ్ దెబ్బతినడంతో వర్షం వస్తే నీరు హస్టల్‌లోకి వస్తోంది. శుద్ధినీరు లేకపోవడంతో బోర్ నీరు తాగుతున్నారు. శుద్ధినీరు ఫిల్టర్ మిషన్ ఇటీవలనే మంజూరైందని త్వరలో ఏర్పాటు చేస్తామని హాస్టల్ వార్డెన్ తెలిపారు.



జమ్మలమడుగు : బ్యాంక్ కాలనీలో అద్దె భవనంలో ఉన్న బీసీ హాస్టల్



జమ్మలమడుగు : పట్టణంలో 1978లో నిర్మించిన హాస్టల్



చక్రాయపేట : బీసీ హాస్టల్‌లో విరిగిపోయిన కిటికీ

క్లుప్తంగా

నేడు ఉచిత షుగర్ పరీక్షలు

పులివెందుల : పట్టణంలోని భాకరాపురంలో ఉన్న దినేష్ మెడికల్ సెంటర్(ఇసీ గంగిరెడ్డి ఆసుపత్రి)లో ఆదివారం ఉదయం 6 గంటల నుంచి ప్రముఖ షుగర్ స్పెషలిస్ట డాక్టర్ వై.జి. హర్షవర్థన్‌రెడ్డి ఉచితంగా షుగర్ పరీక్షలు చేసి సలహాలు, సూచనలు ఇస్తారన్నారని ఆసుపత్రి వర్గాలు తెలిపాయి. ఈ షుగర్ పరీక్షలు చేయించుకోవాలనుకునేవారు పడగడుపున ఏమి తినకుండా రావాలన్నారు. అలాగే ఆసుపత్రిలో నూతనంగా డయాలసిస్ సెంటర్‌ను ప్రారంభించడం జరిగిందని, కిడ్నీ సేవలు ఎల్లప్పుడూ అందుబాటులో ఉంటాయన్నారు. ఈ అవకాశాన్ని పులివెందుల ప్రాంత ప్రజలు సద్వినియోగం చేసుకోవాలన్నారు. ఇతర వివరాలకు 08568 286189, 9963170177 అనే ఫోన్ నెంబర్లకు సంప్రదించాలన్నారు.

మార్కెట్ యార్డు మాజీ వైస్ చైర్మన్ మృతి



నివాళులు అర్పిస్తున్న ఎమ్మెల్సీ రామసుబ్బారెడ్డి

మైలవరం : వైఎస్సార్‌సీపీ నాయకుడు మార్కెట్ యార్డు మాజీ వైస్ చైర్మన్ తలారి సుబ్బరాయుడు(58) అనారోగ్యంతో శనివారం అయ్యవారిపల్లె స్వగృహంలో మృతి చెందాడు. ఈ విషయం తెలుసుకున్న ఎమ్మెల్సీ పి.రామసుబ్బారెడ్డి ఇంటికి వెళ్లి నివాళులు అర్పించారు. అనంతరం కుటుంబ సభ్యులకు సానుభూతి ప్రకటించారు. తలారి సుబ్బరాయుడు కుటుంబానికి వైఎస్సార్‌సీపీ ఎప్పుడు అండగా ఉంటుందన్నారు. ఎమ్మెల్సీ సోదరుడు గిరిధర్‌రెడ్డి, మండల అధ్యక్షుడు ధన్నవాడ మహేశ్వరరెడ్డి నివాళి అర్పించిన వారిలో ఉన్నారు.

సమస్యల పరిష్కారానికి కృషి



నూతన విద్యుత్ స్తంభాన్ని ఏర్పాటు చేయిస్తున్న కౌన్సిలర్, కో ఆప్షన్ మెంబర్

పులివెందుల టౌన్ : పట్టణంలోని స్థానిక రోటరీపురంలో శనివారం భూగర్భ డ్రైనేజీ నీటి సరఫరా సమస్యకు సంబంధించి మున్సిపల్ కమిషనర్ రాముడు ఆధ్వర్యంలో సిబ్బంది పనులను చేపట్టారు. అలాగే ఎర్రగుడిపల్లెలో కూలేందుకు సిద్ధంగా విద్యుత్ స్తంభాన్ని కౌన్సిలర్ పురుషోత్తం, కో ఆప్షన్ మెంబర్ చంద్రమౌళిలు గమనించి ఆ స్థానంలో కొత్త విద్యుత్ స్తంభాన్ని ఏర్పాటు చేయించారు.

అంజన్నకు ప్రత్యేక పూజలు



ప్రత్యేక అలంకరణలో పడమటి అంజనేయస్వామి మూలవిరాట్

పులివెందుల టౌన్ : శ్రావణమాసం తొలి శనివారాన్ని పురస్కరించుకుని పట్టణంలోని ఆంజనేయస్వామి ఆలయాలు భక్తులతో కిటకిటలాడాయి. స్వామివారికి శనివారం తెల్లవారుజాము నుంచి ప్రత్యేక పూజలు, ఆకు పూజలు నిర్వహించి నైవేద్యాలు సమర్పించారు. పట్టణంలోని తూర్పు ఆంజనేయస్వామి, పడమటి ఆంజనేయస్వామి, కోతి సమాధి, పీడబ్ల్యూడీ కాలనీ, ఆర్‌ఆర్ కాలనీలతోపాటు వివిధ అంజన్న ఆలయాల్లో భక్తుల తాకిడితో కనువిందు చేశాయి. భక్తులకు ఆలయ అర్చకులు తీర్థ ప్రసాదాలు పంపిణీ చేశారు.

సీపీఐ జిల్లా కార్యవర్గ సభ్యుడిగా వెంకటరాములు

వేంపల్లె : సీపీఐ జిల్లా కార్యవర్గ సభ్యుడిగా వెంకటరాములును ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. ఈనెల 24వ తేదీన బద్వేలు పట్టణంలో సీపీఐ జిల్లా మహాసభలు మూడు రోజులపాటు జరిగాయి. ఈ మహాసభలలో సీపీఐ పులివెందుల ఏరియా సహాయ కార్యదర్శులుగా పనిచేస్తున్న బ్రహ్మం, అంజనప్పలను ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. ఆదేవిధంగా తొండూరు మండలం నాయకులు ఈశ్వరయ్యను సీపీఐ జిల్లా కౌన్సిల్ సభ్యులుగా ఎన్నుకున్నారు. ఈ సందర్భంగా సీపీఐ జిల్లా కార్యవర్గ సభ్యులు వెంకటరాముడు మాట్లాడుతూ కార్యవర్గం మరింత బాధ్యత పెంచిందని, పార్టీ అభివృద్ధి కోసం ప్రజా సమస్యల పరిష్కారానికి శక్తి వంచన లేకుండా కృషి చేస్తానని పేర్కొన్నారు.

ఉచిత న్యాయ సహాయాన్ని సద్వినియోగం చేసుకోండి

పులివెందుల రూరల్ : ఉచిత న్యాయ సహాయాన్ని సద్వినియోగం చేసుకోవాలని జిల్లా న్యాయ సేవాధికార సంస్థ ప్రధాన న్యాయమూర్తి బాబాఫకృద్దీన్ ఖైదీలకు సూచించారు. శనివారం పట్టణంలోని సబ్ జైలులో లీగల్ ఎయిడ్ క్లినిక్‌ను ఆయన తనిఖీ చేసి రికార్డులను పరిశీలించారు. ఈ సందర్భంగా ఆయన ఖైదీలతో మాట్లాడి వారి కేసు వివరాలను, ఆరోగ్య విషయాలను అడిగి తెలుసుకున్నారు. అనంతరం ఆయన జైలు పరిసరాలను, రిజిస్టర్లు పరిశీలించి తగిన సూచనలు, సలహాలు ఇచ్చారు. లీగల్ ఎయిడ్ సర్వీసెస్ హెల్ప్‌లైన్ నెంబర్ 15100పై అవగాహన కల్పించారు. కార్యక్రమంలో పులివెందుల సబ్ జైలు సూపరింటెండెంట్, న్యాయవాదులు, పారా లీగల్ వలంటీర్లు, ఖైదీలు, తదితరులు పాల్గొన్నారు.



ఖైదీల వివరాలను తెలుసుకుంటున్న న్యాయమూర్తి బాబాఫకృద్దీన్

రక్త గ్రూపు నిర్ధారణ అవసరం

పులివెందుల : మానవ జీవితంలో రక్తగ్రూప్ నిర్ధారణ అతి ముఖ్యమైనదని కళాశాల ఇన్‌చార్జి ప్రిన్సిపాల్ గణేష్ తెలిపారు. శనివారం పట్టణంలోని స్థానిక ప్రభుత్వ బాలికల జూనియర్ కళాశాలలో స్నేహిత అమృత హస్తం సేవా సమితి, ఎన్‌ఎస్‌ఎస్ విభాగం సంయుక్త ఆధ్వర్యంలో శనివారం నిర్వహించిన రక్తగ్రూప్ నిర్ధారణ కార్యక్రమాన్ని కళాశాల ఇన్‌చార్జి ప్రిన్సిపాల్, స్నేహిత అమృత హస్తం సేవాసమితి అధ్యక్షుడు రాజులు ప్రారంభించి మాట్లాడారు. ఏదైనా అత్యవసర శస్త్రచికిత్స, ప్రసవం లాంటి సమయాలలో రక్తదానం చేసేందుకు సిద్ధంగా ఉండాలంటే ముందుగా రక్త గ్రూపు తెలిసి ఉంటే ఆయా సమయాలలో ఉపయోగపడుతుందన్నారు. ప్రతి ఒక్కరూ రక్త గ్రూపు నిర్ధారణ చేయించుకుని వీలైనంత వరకు ఏ సమయంలో అయినా సరే రక్తదానం చేసేందుకు సిద్ధంగా ఉండాలన్నారు. దాదాపు 360 మందికి రక్తగ్రూపు నిర్ధారణ చేసి వారి రక్త గ్రూపు వివరాలను తెలియజేశారు. కార్యక్రమంలో ఎన్‌ఎస్‌ఎస్ కో ఆర్డినేటర్లు నాగేంద్రమ్మ, అనిత, అధ్యాపకులు, ల్యాబ్ టెక్నిషియన్లు, తదితరులు పాల్గొన్నారు.



విద్యార్థినులకు రక్తగ్రూపు నిర్ధారణ పరీక్షలు చేస్తున్న ల్యాబ్ టెక్నిషయన్లు

పర్యావరణ పరిరక్షణకు మొక్కలే ఆధారం

వేంపల్లె : పర్యావరణ పరిరక్షణకు మొక్కలు ఆధారమని ఇడుపులపాయ ఆర్కే వ్యాలీ ట్రిపుల్‌ఐటీ డైరెక్టర్ ఏవీఎస్ కుమారస్వామి గుప్తా తెలిపారు. స్వర్ణాంధ్ర, స్వచ్ఛ ఆంధ్రలో భాగంగా శనివారం ట్రిపుల్‌ఐటీ ఎన్‌ఎస్‌ఎస్ ప్రోగ్రాం నిర్వహణాధికారి డి.కోనప్ప ఆధ్వర్యంలో మొక్కలు నాటే కార్యక్రమం చేపట్టారు. ఈ సందర్భంగా డైరెక్టర్ ట్రిపుల్‌ఐటీలోని గ్రంథాలయ ప్రాంగణంలో మొక్కలు నాటి మాట్లాడారు. మొక్కలు నాటడంవలన ఆరోగ్యవంతమైన భవిష్యత్‌కు పచ్చదనం అత్యవసరమన్నారు. చెట్లు పర్యావరణ ప్రగతికి మెట్లు అని విద్యార్థులకు వివరించారు. ప్రతి విద్యార్థి ట్రిపుల్‌ఐటీ చేరిన మొదటి సంవత్సరమే ఒక్కొక్కరు ఒక్కొక్క మొక్క నాటాలని, నాటిన మొక్కకు విద్యాలయంలో ఉన్నంత వరకు నీరు పోసి పెంచాలన్నారు. కార్యక్రమంలో ఏఓ రవికుమార్, విద్యాధికారి రమేష్ కైలాస్, క్యాంపస్ నిర్వహణ అధికారి పవన్‌కుమార్, ఎన్‌ఎస్‌ఎస్ వలంటీర్లు, విద్యార్థులు పాల్గొన్నారు.



మొక్క నాటి నీరుపోస్తున్న ట్రిపుల్ ఐటీ డైరెక్టర్ కుమారస్వామి గుప్తా

రైలు కింద పడి వ్యక్తి మృతి

ముద్దనూరు : ముద్దనూరు–మంగపట్నం రైల్వేట్రాక్ చెన్నారెడ్డిపల్లె సమీపంలో గుర్తుతెలియని వ్యక్తి రైలు కింద పడి దుర్మరణం చెందాడు. ఎర్రగుంట్ల రైల్వే ఎస్‌ఐ సునీల్‌కుమార్‌రెడ్డి సమాచారం మేరకు.. శుక్రవారం రాత్రి సుమారు 35 సంవత్సరాల వయసువున్న వ్యక్తి రైలు కింద పడి మృతి చెందాడని, అతనికి సంబంధించిన ఆధారాలు ఏమీ లభించలేదన్నారు. మృతుడు తెల్లటి ప్యాంటు, తెల్ల కట్‌బనియన్ ధరించి వున్నాడు. కేసు నమోదు చేసి చేశామని మృతుని వివరాలు తెలిసిన వారు ఎర్రగుంట్ల రైల్వే పోలీసులను సంప్రదించాలని ఎస్‌ఐ తెలిపారు.

ప్రకృతి వ్యవసాయం విస్తృతం చేయాలి

కమలాపురం : ప్రకృతి వ్యవసాయంను విస్తృతం చేయాలని ఏడీఏ నరసింహారెడ్డి తెలిపారు. స్థానిక ఏడీఏ కార్యాలయంలో మూడు రోజులుగా వల్లూరు, కమలాపురం మండలాల ప్రకృతి వ్యవసాయ, ఆర్‌ఎస్‌కే సిబ్బందికి జరుగుతున్న శిక్షణ కార్యక్రమం శనివారం ముగిసింది. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ మూడు రోజులుగా ప్రకృతి వ్యవసాయంపై జరిగిన శిక్షణ కార్యక్రమంలో చెప్పిన అంశాలను రైతులతో అన్వయించాలన్నారు. ప్రకృతి వ్యవసాయం ద్వారా తక్కువ ఖర్చుతో అధిక ఆదాయం గడించవచ్చని రైతులకు అవగాహన కల్పించాలన్నారు. 365 రోజులు వివిధ పంటలతో భూమిని కప్పి ఉంచాలన్నారు. దేశవాళీ విత్తనాల ప్రాముఖ్యతను వివరించారు. పశువులను వ్యవసాయంలో అనుసంధానం చేయాలన్నారు. మెరుగైన వ్యవసాయ పద్ధతులు, కషాయాల ద్వారా చీడ పీడల యాజమాన్యము పైన రైతులకు సరైన అవగాహన కల్పించాలని సూచించారు. కార్యక్రమంలో ఏఓలు సరస్వతి, కిరణ్‌కుమార్‌రెడ్డి, భూషణ్ కుమార్, ఏపీసీఎన్‌ఎఫ్, ఆర్‌ఎస్‌కే సిబ్బంది పాల్గొన్నారు.



మాట్లాడుతున్న ఏడీఏ నరసింహారెడ్డి

ముద్దనూరులో..

ముద్దనూరు : రైతులకు ప్రకృతి వ్యవసాయంపై అవగాహన పెంచి ఎక్కువ మంది రైతులు ప్రకృతి వ్యవసాయం సాగుచేసేలా సిబ్బంది కృషి చేయాలని ముద్దనూరు ఏడీఏ రామ్మోహన్‌రెడ్డి తెలిపారు. స్థానిక ఎంపీడీవో కార్యాలయంలో వ్యవసాయ డివిజనల్‌లోని మండలాల రైతుసేవాకేంద్రం సిబ్బందికి ప్రకృతి వ్యసాయంపై 3 రోజుల శిక్షణ కార్యక్రమం ముగిసింది. ఈ సందర్భంగా ఏడీఏ మాట్లాడుతూ సహజ సిద్ధమైన సాగుపై కలిగే లాభాలను వివరించి రైతులను ప్రోత్సహించాలని సూచించారు. మండల వ్యవసాయాధికారి వెంకట కృష్ణారెడ్డి మాట్లాడుతూ నిత్యం రైతులకు అందుబాటులో వుండి సేవలందించాలని, ప్రకృతి వ్యవసాయంలో రైతులు రాణించేలా చూడాలని సూచించారు. కార్యక్రమంలో సింహాద్రిపురం ఏవో కళ్యాణ్ కుమార్, కొండాపురం ఏవో రామాంజనేయులు సిబ్బంది పాల్గొన్నారు.

లైన్‌మెన్‌కు గాయాలు



ప్రమాదంలో గాయపడిన ప్రసాద్

ముద్దనూరు : ముద్దనూరు–తాడిపత్రి జాతీయ రహదారిలో జమ్మలమడుగు బైపాస్ రోడ్ వద్ద గుర్తు తెలియని వాహనం ఢీ కొని విద్యుత్‌శాఖ లైన్‌మెన్‌కు తీవ్రగాయాలయ్యాయి. స్థానికుల సమాచారం మేరకు.. బొందలకుంట సచివాలయ లైన్‌మెన్‌గా విధులు నిర్వహిస్తున్న ప్రసాద్ శుక్రవారం రాత్రి విద్యుత్ సమస్యపై ఫోన్‌రావడంతో ముద్దనూరు నుంచి బొందలకుంటకు మోటర్‌బైక్‌పై బయలుదేరాడు. బైపాస్ క్రాస్ వద్దకు రాగానే గుర్తుతెలియని వాహనం ఢీకొనడంతో ప్రసాద్‌కు తలకు తీవ్రగాయాలయ్యాయి. 108 వాహనంలో ప్రొద్దుటూరు ప్రభుత్వ ఆసపత్రికి తరలించి అనంతరం మెరుగైన వైద్యం కోసం ఓ ప్రైవేటు ఆసుపత్రికి తరలించారు.

లారీలో డీజిల్ చోరీ

ముద్దనూరు : ముద్దనూరు–తాడిపత్రి జాతీయరహదారిలో స్థానిక పాత డిగ్రీ కళాశాలకు ఎదురుగా నిలిపివున్న లారీ డీజిల్ ట్యాంకరు నుంచి 480 లీటర్ల డీజిల్‌ను చోరీ చేశారు. బాధితుల సమాచారం మేరకు.. గిద్దలూరు నుంచి వచ్చిన లారీ చిలంకూరుకు ఐసీఎల్ ఫ్యాక్టరీకి వెళ్శాల్సివుంది. ముద్దనూరుకు చెందిన డ్రైవరు శుక్రవారం రాత్రి లారీని నిలిపి ఇంటికి వెళ్ళాడు. శనివారం ఉదయం బయలుదేరడానికి వచ్చిన డ్రైవరు లారీ డీజిల్ ట్యాంకరు తాళం పగలగొట్టి ఉండటాన్ని చూశాడు. అందులోని డీజిల్‌ను దొగలు దొంగలించినట్లు గమనించాడు. ఈ డీజిల్ విలువ సుమారు రూ.48 వేలు వుంటుందని బాధితుడు తెలిపారు.

తాగునీటి సమస్య పరిష్కారానికి కృషి

వేంపల్లె : తాగునీటి సమస్య పరిష్కారానికి కృషి చేస్తున్నట్లు జెడ్పీటీసీ రవికుమార్‌రెడ్డి తెలిపారు. శనివారం వేంపల్లె గ్రామ పంచాయతీ పరిధి రాజీవ్ కాలనీలో ఆయన మండల పరిషత్ నిధులతో తాగునీటి బోరు వేసేందుకు ప్రత్యేక పూజలు చేసి ప్రారంభించారు. కొన్ని నెలలుగా రాజీవ్ కాలనీలో తాగునీటి సమస్య ఎక్కువగా ఉందని, తమ దృష్టికి తీసుకరావడంతో వెంటనే స్పందించి తాగునీటి పరిష్కారానికి బోరును వేస్తున్నట్లు తెలిపారు. రాజీవ్ కాలనీలోని జగనన్న కాలనీలలో ఎగువన ఉన్న ప్రాంతాల్లో తాగునీటి సమస్య అధికంగా ఉందన్నారు. రెండు, మూడు రోజుల్లో బోర్లు వేయించి తాగునీటి సమస్య లేకుండా చర్యలు తీసుకుంటామన్నారు. కార్యక్రమంలో ఎంపీటీసీలు రాజ్ కుమార్, కటిక చంద్రశేఖర్, రవి, ప్రశాంత్, వైఎస్సార్‌సీపీ నాయకులు పాల్గొన్నారు.



తాగునీటి బోరు వేసే ప్రాంతంలో ప్రత్యేక పూజలు చేస్తున్న జెడ్పీటీసీ రవికుమార్‌రెడ్డి

ఆలయాల్లో శ్రావణమాస తొలి పూజలు

వేంపల్లె : శ్రావణమాసం మొదటి శనివారం పురస్కరించుకుని వేంపల్లెలోని శ్రీవాసవీ కన్యకా పరమేశ్వరి దేవస్థానం, మెయిన్ బజార్‌లోని ఆంజనేయస్వామి ఆలయం, ఎద్దులకొండపై ఉన్న వృషభాచలేశ్వరస్వామి ఆలయాలలో శనివారం శ్రావణమాస తొలి పూజలు నిర్వహించారు. ఈ సందర్భంగా వాసవీ మాతను ఒడిబియ్యం సామగ్రితో అలంకరించారని ఆర్యవైశ్య మహిళా మండలి ఉపాధ్యక్షురాలు కాంభోజి నిర్మల తెలిపారు. అర్చకులు ఇంద్రకంటి ప్రసాద్ శర్మ నేతృత్వంలో అమ్మవారికి తదితర విశేష పూజలు నిర్వహించారు. రాత్రి ఆలయంలో అమ్మవారికి ప్రాకారోత్సవం నిర్వహించారు.





అంజన్న దర్శనం.. భక్తజన పరవశం



ఆలయం ఎదుట పెద్ద ఎత్తున ఉన్న భక్తులు



ప్రత్యేక అలంకరణలో గండి అంజన్న

- భక్తులతో కిటకిటలాడిన గండి క్షేత్రం
- తొలి శనివారం ఆదాయం రూ.13 లక్షలు

చక్రాయపేట : శ్రావణ మాసం తొలి శనివారోత్సవం భక్తుల రద్దీతో గండి క్షేత్రం కిటకిటలాడింది. ఆలయ చరిత్రలో ఎప్పుడు కూడా తొలి శనివారం నాడు అంతగా రాని భక్త జనం ఈ వారం వచ్చారు. ఆలయ వర్గాలు కూడా ఇంతటి జనం వస్తారని ఊహించలేదు. గండికి వచ్చిన భక్తులు ప్రశాంతంగా గంటల తరబడి క్యూలైన్‌లో నిలబడి స్వామిని దర్శించుకొని పరవశించి పోయారు. వర్షాలు లేని కారణంగా పాపాఘ్ని నదిలో నీరు లేకపోవడంతో ఆలయ వర్గాలు భక్తుల సౌకర్యార్థం కాలువ తవ్వించిరు. పైగా ఫిల్టర్లు వేసి ప్రత్యేక స్నానఘట్టాలు ఏర్పాటు చేయించారు. వాటి వద్ద భక్తులు స్నానాలు చేసి దర్శనం చేసుకున్నారు. వేంపల్లె వైపు నుంచి పెద్ద ఎత్తున భక్తులు కాలినడకన గండికి చేరుకున్నారు. ఉదయం నుంచి మధ్యాహ్నం రెండు గంటల వరకు భక్తుల తాకిడి కనిపించింది. ఈ సమయంలో భక్తుల రద్దీ దృష్టిలో ఉంచుకొని పోలీసులు కొద్ది సేపు వాహనాలను గండిలోకి అనుమతించలేదు. ఎలాంటి అవాంఛనీయ సంఘటనలు చోటు చేసుకోకుండా ఆర్కే వ్యాలీ సీఐ ఉలసయ్య ఆధ్వర్యంలో ఎస్‌ఐలు రంగారావు, చంద్రశేఖర్‌తోపాటు పెద్ద ఎత్తున పోలీసులు బందోబస్తు నిర్వహించారు. కొందరు భక్తులు అన్నదానం ఏర్పాటు చేశారు. చక్రాయపేట ప్రభుత్వ వైద్యాధికారిణి వాణి ఆధ్వర్యంలో ఉచిత వైద్య శిబిరం నిర్వహించారు. ఆలయంతోపాటు కడప రిమ్స్ ఆధ్వర్యంలో ఉచిత రక్తదాన శిబిరం నిర్వహించారు. ఈ శిబిరానికి విశేష స్పందన వచ్చిందని నిర్వాహకుడు వెంకటప్రసాద్ తెలిపారు. చక్రాయపేట ఆంధ్రప్రదేశ్ గ్రామీణ బ్యాంకు మేనేజరు భానుచందర్ ఆధ్వర్యంలో వారి సిబ్బంది టికెట్లు, లడ్డూ కౌంటర్ల బాధ్యతలను నిర్వహించారు. ఆర్కేవ్యాలీ ట్రిపుల్ ఐటీ విద్యార్థులు పలువురు స్వామి సేవకులు తమ సేవలను అందించారు. ఉత్సవ ఏర్పాట్లను ఆలయ అధికారి వెంకటసుబ్బయ్య, చైర్మన్ కావలి కృష్ణతేజ, పాలక మండలి సభ్యులు మాజీ చైర్మన్‌లు వెంకటస్వామి, వీరభాస్కరుడులు పర్యవేక్షించారు. జిల్లా వైద్యారోగ్యశాఖ అధికారి నాగరాజు స్వామిని దర్శించుకున్నారు. ఆలయ ప్రధాన ఉపప్రధాన, ముఖ్య అర్చకులు కేసరి, రాజారమేష్, రాజగోపాలాచార్యులు రఘు స్వామిలు.. ఆంజనేయస్వామి వారిని ప్రత్యేకంగా పూలతో అలంకరించారు. భక్తులకు తీర్థ ప్రసాదాలను అందజేశారు.

ఆదాయం రూ.13 లక్షలు

శ్రావణ మాసం తొలిశనివారం ఆలయానికి రూ.13,12,204లు ఆదాయం వచ్చినట్లు ఆలయ సహాయ కమిషనర్ వెంకటసుబ్బయ్య తెలిపారు. ఈ ఆదాయం ప్రసాదాల విక్రయం, సేవాటికెట్లు, అన్నదాన విరాళాలు, తాత్కాలిక అంగళ్లు, తాత్కాలిక హుండీల ద్వారా వచ్చిందన్నారు. ఆలయ శాశ్వత నిత్యాన్నదాన పథకానికి ప్రొద్దుటూరుకు చెందిన గంజికుంట రాజమోహన్ జ్ఞాపకార్థం ఆయన సతీమణి వరలక్ష్మి, మనుమడు ఉదయకిరణ్, మనుమరాలు లక్ష్మీప్రియలు రూ.1,01,116లు విరాళంగా నగదు రూపంలో అందజేశారని ఆయన తెలిపారు.